ప్రగతి పరుగులు

- 'ఉత్తర'లో జోరుగా అభివృద్ధి పనులు
- ప్రతి వార్డులో ప్రజోపయోగ నిర్మాణాలు
- జీవీఎంసీ, 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధులతో పనులు చకచకా


సీతంపేటలో నిర్మిస్తున్న సీసీ డ్రెయిన్లు


25వ వార్డు మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో నిర్మిస్తున్న అదనపు అంతస్తు

సీతంపేట: ఉత్తర నియోజకవర్గ ప్రగతి పరుగులు తీస్తోంది. నియోజకవర్గంలో మొత్తం 17 వార్డులు ఉండగా.. జీవీఎంసీ జోన్-3 పరిధిలో 4.. జోన్-5లో మిగిలిన 13 వార్డులు ఉన్నాయి. ప్రతి వార్డులో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. జీవీఎంసీ కౌన్సిల్ ఏర్పాటైన ఈ రెండేళ్లలో ప్రతి వార్డులో కోట్లాది రూపాయల పనులతో ఆయా వార్డుల కార్పొరేటర్లు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, కె.కె.రాజు ఎప్పటికప్పుడు వార్డు కార్పొరేటర్లతో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. వార్డులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి ఉత్తర అభివృద్ధికి కృషి చేస్తున్నారు. నియోజకవర్గంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పనులకు సైతం నిధులు మంజూరు చేయించారు. ఇక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి పనులను జీవీఎంసీ కమిషనర్, కలెక్టర్‌ల దృష్టికి తీసుకెళ్లి అనుమతులు, నిధులు మంజూరు చేయిస్తున్నారు. జీవీఎంసీ నిధులు, గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో అభివృద్ధి పనులు చకచకా నిర్వహిస్తున్నారు.

25వ వార్డులో..

జీవీఎంసీ నిధులు రూ.27.80 లక్షలతో జోన్-3 పరిధి 25వ వార్డులో సీతంపేట మెయిన్ రోడ్ ఆంజనేయ స్వామి గుడి నుంచి గొల్ల వీధి సాయిబాబా గుడి వరకు, దుర్గాగణపతి ఆలయం వెనుక రోడ్‌లో కొత్తగా సీసీ డ్రెయిన్లు నిర్మిస్తున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు డ్రెయిన్ల సమస్యను తెలియజేయడంతో కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించారు.

- మధురానగర్‌లో జీవీఎంసీ హైస్కూల్, ప్రైమరీ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రం అన్నీ ఒకే ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. తరగతి గదుల కొరతతో విద్యార్థులుఇబ్బంది పడుతున్నారు. కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ చొరవతో సుమారు రూ.36 లక్షలతో అదనపు అంతస్తు నిర్మిస్తున్నారు. దీనివల్ల పాఠశాలకు ఐదు తరగతి గదులు అదనంగా సమకూరనున్నాయి.

26వ వార్డులో..

జోన్-3 పరిధి 26వ వార్డు లలితానగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన రూ.20 లక్షల నిధులతో సీసీ డ్రెయిన్లు నిర్మిస్తున్నారు. జీవీఎంసీ మంజూరు చేసిన రూ.50 లక్షల నిధులతో అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.

43వ వార్డులో..

జోన్-5 పరిధి 43వ వార్డు వెంకటేశ్వర కాలనీలో జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల, పై అంతస్తులో కమ్యూనిటీ హాల్ ఉండేది. దీన్ని వార్డు సచివాలయాలకు కేటాయించడంతో సభలు, సమావేశాల నిర్వహణకు సరైన వసతి లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ చొరవతో స్థానికుల సమస్య తీరేలా సుమారు రూ.36 లక్షలతో అదనంగా మరో అంతస్తు నిర్మిస్తున్నారు.

- రూ.33.50 లక్షలతో శ్రీనివాసనగర్ గెడ్డపై పాత బ్రిడ్జి స్థానంలో కొత్తది నిర్మిస్తున్నారు. శ్రీనివాసనగర్, నందగిరినగర్, జగన్నాథపురం ప్రాంతాలకు ఇరుకైన రహదారులు ఉండటంతో అత్యవసర సమయాల్లో అంబులెన్స్ కూడా వచ్చే అవకాశం లేక ఏళ్ల తరబడి స్థానికుల ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులకు స్థానికులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా.. సమస్య పరిష్కారం కాలేదు. జీవీఎంసీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు 43వ వార్డు కార్పొరేటర్ ఉషశ్రీ రూ. 33.50 లక్షల నిధులు మంజూరు చేయించారు. దీంతో కొత్త బ్రిడ్జి మీదుగా 80 ఫీట్ రోడ్ నుంచి శ్రీనివాసనగర్, నందగిరినగర్, జగన్నాథపురం ప్రాంతాలకు నాలుగు చక్రాల వాహనాలు రాకపోకలు సాగించేలా మార్గం సుగమం అవుతుంది. ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం లభించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


43వ వార్డు శ్రీనివాసనగర్‌లో గెడ్డపై కొత్తగా నిర్మిస్తున్న బ్రిడ్జి

44వ వార్డులో....

జోన్-5 పరిధి 44వ వార్డులోని రామచంద్రానగర్, అబిద్‌నగర్ ప్రాంతాల్లో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు చొరవతో సుమారు రూ.80 లక్షలతో బీటీ రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణాలు జరుగుతున్నాయి.

- అబిద్‌నగర్ షాదీఖానా(కల్యాణ మండపం) వెనుక రూ.12 లక్షలతో డ్వాక్రా సంఘాలకు కమ్యూనిటీ హాల్ నిర్మిస్తున్నారు.
- రామచంద్రానగర్‌లో సుమారు రూ.58 లక్షలతో సీసీ డ్రెయిన్లు నిర్మిస్తున్నారు. ఈ ప్రాంతంలో డ్రెయిన్లు శిథిలం కావడంతో కిలోమీటరు నిడివి గల డ్రెయిన్లు కొత్తగా కడుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

త్వరితగతిన ప్రజా వినతుల పరిష్కారం


అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: ప్రజా వినతులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ ఆదేశించారు. జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి పలు సమస్యలపై 06 వినతులు అందాయి. అర్జీదారుల వద్ద నుంచి వాటిని జెడ్సీ స్వీకరించి పరిశీలించారు. ఆయా విభాగాల అధికారులకు పరిష్కార నిమిత్తం అందజేశారు. టౌన్ ప్లానింగ్‌కు 03, రెవెన్యూకు 02, యూసీడీ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్-1 టి.ఎస్.ఎన్.రాజు, సూపరింటెండెంట్-2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ శ్రీనివాసరావు, టి.ప్రసన్నరెడ్డి, వాటర్ వర్క్స్ ఈఈ-2 సూరిశెట్టి శేఖర్, డీఈ శ్రీనివాసవర్మ, టౌన్ ప్లానింగ్ ఏసీపీ రఘునాథ్, టీపీవో శ్రీలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, సూపర్‌వైజర్ జనార్దన్, టీపీఆర్‌వో ఏపీడీ చిరంజీవి, సచివాలయ అడ్మిన్లు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


వ్యక్తి మృతదేహం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో అపస్మారక స్థితిలోకి వెళ్లిన గుర్తు తెలియని ఓ వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మరణించాడు. జీఆర్పీ సీఐ పి.కోటేశ్వరరావు ఆదేశాలతో ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. జూలై 29న రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాం నంబర్ 4 వద్ద అపస్మారక స్థితిలో మాట్లాడలేని స్థితిలో ఓ వ్యక్తి ఉండగా.. జీఆర్పీ సిబ్బంది గమనించి అతడిని అంబులెన్స్ సహాయంతో కేజీహెచ్‌కు తరలించారు. ఇతను చికిత్స పొందుతూ 30వ తేదీ ఆదివారం రాత్రి మృతిచెందాడు. ఇతని వద్ద ఏవిధమైన ఆధారాలు లేవు. ఈ వ్యక్తి వయసు సుమారు 60 ఏళ్లు. సుమారు 5.5 అడుగుల ఎత్తు, తెలుపు రంగు శరీరం. తెల్లని పంచె, ముదురు నీలం రంగు చొక్కా ధరించి ఉన్నాడు. మృతుని వివరాలు తెలిసిన వారు విశాఖ రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ సిబ్బందికి స్వయంగా లేదా 98664 13487/94406 27547 నంబర్లలో తెలియజేయాలని ఎస్‌ఐ శ్రీనివాసరావు కోరారు.

ఆసక్తికరంగా కవి సమ్మేళనం


సాహితీ సమ్మేళనంలో పాల్గొన్న కవులు

మురళీనగర్: మాధవధార భరద్వాజ క్షేత్రంలో అమరావతి విశ్వసాహితీ సమితి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సాహితీ సమ్మేళనం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. పిల్లా అర్జునుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 12 మంది కవులు పాల్గొని తమ రచనలు చదివి వినిపించారు. గుర్రం జాషువా - సామాజిక స్పృహ అనే అంశంపై సభలో చర్చ జరిగింది. అనంతరం అమరావతి విశ్వసాహితి చరిత్రను వివరించారు. ప్రముఖ కవి, నటుడు పాలమరశెట్టి ఫ్రాన్సిస్ సమన్వయకర్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో కార్యదర్శి సిహెచ్. చినసూర్యనారాయణ, డి.ఎస్.కుమార్, రామ్‌తాతా తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కారు ఢీకొని ఓ వ్యక్తికి గాయాలైన ఘటన జరిగింది. సోమవారం కంచరపాలెం మెట్టు నుంచి ఊర్వశి కూడలి వైపు మద్యం తాగి హుండాయ్ క్రెటా కారు నడుపుతూ అదే మార్గంలో ఎదురుగా వస్తున్న ఓ వ్యక్తిని ఢీకొన్నాడు. దీంతో బైకుపై వస్తున్న వ్యక్తికి కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బైక్‌పై వెళ్తూ మూర్ఛతో వ్యక్తి మృతి


మృతి చెందిన ఎల్లంకి శ్రీనివాస్

అక్కిరెడ్డిపాలెం: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి మూర్ఛ వ్యాధికి గురై మృతి చెందిన ఘటన ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద సోమవారం జరిగింది. గాజువాక ఎస్‌ఐ కొల్లి సతీష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అక్కయ్యపాలెం ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన ఎల్లంకి శ్రీనివాస్(44) ఓ లిఫ్ట్ కంపెనీలో మార్కెటింగ్ విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం శ్రీనివాస్ గాజువాక నుంచి ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్దకు వచ్చేసరికి మూర్ఛ రావడంతో హఠాత్తుగా తన వాహనాన్ని నిలిపి పక్కకు ఒరిగిపోయాడు. కొద్దిసేపటికే మృతి చెందాడు. పలువురు ఆయనకు సపర్యలు చేసినా ఫలితం లేకుండా పోయింది. సమాచారం అందుకున్న గాజువాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ కొల్లి సతీష్ తెలిపారు. మృతుని వద్ద ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా బంధువులకు సమాచారం అందించారు. మృతునికి భార్య, పాప, బాబు ఉన్నారు.

17 నుంచి శ్రావణ మాసం పూజలు

దాబాగార్డెన్స్: ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు శ్రావణమాసం పూజలు జరగనున్నాయి. కనమహాలక్ష్మి దేవస్థానంలో నెల రోజులూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, అలాగే గురు, శుక్రవారాల్లో 2 విడతలుగా ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, 9.30 నుంచి 10.30 గంటల వరకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. విశిష్ట సామూహిక కుంకుమ పూజలో పాల్గొనదలిచే భక్తులు(దంపతులు) రూ.400 రుసుం చెల్లించాలి. పూజా సామగ్రిని దేవస్థానమే సమకూర్చుతుంది. పూజ అనంతరం భక్తులకు శేషవస్త్రాలు, మహాప్రసాదం అందజేస్తారు. పూజా రుసుంను అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్: యూబీఐఎన్0806081, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచిలో చెల్లించాలని ఆలయ ఈవో శిరీష, ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం తెలిపారు. పూర్తి వివరాలకు 0891-2568645, 2566515, 2731250 నంబర్లలో సంప్రదించాలన్నారు. పూజలో పాల్గొనలేని భక్తుల గోత్రనామాలతో పూజ చేసి లక్ష్మీ యంత్రం, కుంకుమ, ప్రసాదం పోస్టల్ ద్వారా ఇంటికి పంపనున్నట్టు ఈవో పేర్కొన్నారు.

అలరించిన సంగీత విభావరి


పాటలు పాడుతున్న గాయకులు

సీతంపేట: పాటే మీ-మా ప్రాణం సంగీత సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన ఆపాత మధురాలు ఆద్యంతం అలరించాయి. విశాఖ గాయనీ గాయకుల సాంస్కృతిక సంఘం ముఖ్య సలహాదారు సన్‌మూర్తి, నిర్వాహకులు నాగులపల్లి వెంకటేశ్వరరావు, పల్లా వెంకటేష్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాయనీ గాయకులు నాగులపల్లి, బొమ్మిడి సత్యనారాయణ, శ్యాంసుందర్, శివకోటి, జగదీష్, వెంకట్, గాయత్రి శ్రీదేవి, మనుపల్ల, రాధ, జగదాంబ, కె.గౌరి, మాధురి, జాస్మిన్ పాత పాటలు ఆలపించి అలరించారు.

యువ టూరిజం క్లబ్ ప్రారంభం


యువ టూరిజం క్లబ్ బ్యానర్‌తో ఎఫ్‌సీఐ అధ్యాపకులు, సిబ్బంది

ఆరిలోవ: ప్రభుత్వ ఫుడ్ క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌సీఐ)లో యువ టూరిజం క్లబ్‌ను సోమవారం ప్రారంభించారు.

దీనిలో ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థుల కో ఆర్డినేటర్లు ఇద్దరు(ఒక బాయ్, ఒక గర్ల్)తో పాటు అధ్యాపకులతో కలసి ఐదుగురు సభ్యులుగా ఉన్నారు. దీని కోసం బ్యానర్ తయారు చేసి ఇన్‌స్టిట్యూట్ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇన్‌స్టిట్యూట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.వి.రమణ మాట్లాడుతూ యువ టూరిజం క్లబ్ ద్వారా ప్రజలకు, నగరానికి వచ్చే టూరిస్టులకు కేంద్ర, రాష్ట్ర టూరిజంపై అవగాహన కల్పిస్తారన్నారు. దీనివల్ల టూరిజంలో యువతకు కలిగే ఉద్యోగ అవకాశాలపై అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో టూరిజం జిల్లా అధికారి దాస్, అధ్యాపకులు రవి, పార్థసారథి, సిబ్బంది దివ్య, మహాలక్ష్మి, కృష్ణ, లక్ష్మి పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు ఘన స్వాగతానికి భారీ ఏర్పాట్లు


మీడియాతో మాట్లాడుతున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

తాటిచెట్లపాలెం: ఇనార్బిట్ మాల్ శంకుస్థాపనకు మంగళవారం విచ్చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికేందుకు విశాఖపట్నం సమాయత్తమైందని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు తెలిపారు. ఇనార్బిట్ మాల్ ప్రాంతంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కైలాసపురం పోర్టు హాస్పిటల్ సమీపంలో సుమారు 17 ఎకరాల విస్తీర్ణంలో రహేజా గ్రూప్ నిర్మించనున్న ఇనార్బిట్ మాల్‌తో విశాఖ నగర ఖ్యాతి దేశదేశాల విస్తరించనుందని చెప్పారు. సుమారు రూ.600 కోట్లతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టును మన రాష్ట్రంలో ప్రత్యేకంగా విశాఖలో ఏర్పాటు చేసేందుకు కృషి చేసిన సీఎం వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం పలికేందుకు నగరవాసులు ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తున్నారన్నారు. ఎయిర్‌పోర్టు నుంచి ఇనార్బిట్ మాల్ ప్రాంతం వరకు భారీ మానవహారం ఏర్పాటు చేసి పూల వర్షంతో ముఖ్యమంత్రికి భారీ స్థాయిలో స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యామని తెలిపారు. సమావేశంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, పార్టీ నాయకురాలు పేడాడ రమణికుమారి తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన కార్యక్రమాన్ని జయప్రదం చేద్దాం


పార్టీ నాయకులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మర్రిపాలెం: ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఇనార్బిట్ మాల్ శంకుస్థాపనకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పిలుపునిచ్చారు. వార్డు కార్యాలయంలో సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కైలాసపురం పోర్టు ఆస్పత్రి సమీపంలో ఇనార్బిట్ మాల్ నిర్మాణానికి మంగళవారం సీఎం వైఎస్ జగన్ భూమిపూజ చేస్తారన్నారు. పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

దగ్ధమైన ఇల్లు పరిశీలన


సాయికుమార్ ఇంటిని పరిశీలిస్తున్న కె.కె.రాజు, రెయ్యి వెంకటరమణ

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు అంబేడ్కర్ కాలనీలో అగ్నిప్రమాదం జరిగి దగ్ధమైన ఇంటిని సోమవారం వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి వెళ్లి పరిశీలించారు. స్థానిక పైడితల్లి అమ్మవారి ఆలయ చైర్మన్, డ్యాన్స్ మాస్టర్ పక్కి సాయికుమార్ ఇల్లు షార్ట్‌సర్క్యూట్ వల్ల ఆదివారం అగ్నిప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఈమేరకు ప్రమాదం ఎలా జరిందని వారు ఆరా తీశారు. సాయికుమార్‌కు అండగా ఉంటామని హామీ ఇచ్చి, కొంత నగదు ఆర్థిక సాయం అందించారు.

కళావేదిక నిర్మాణ పనులు..

అంబేడ్కర్ కాలనీలో నిర్మిస్తున్న కళావేదికను సోమవారం సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి పరిశీలించారు. రూ.39 లక్షలతో కళావేదిక నిర్మాణానికి ఇటీవల కె.కె..రాజు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. నెల రోజుల వ్యవధిలో నిర్మాణ పనులు పూర్తయ్యే అవకాశముందని అంచనా వేస్తున్నారు.

ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించండి


జాయింట్ కలెక్టర్ విశ్వనాథ్‌కు ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ గోవింద్

సీతంపేట: కబ్జాకు గురవుతున్న విలువైన ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ కోరారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విశ్వనాథ్, మేయర్ హరివెంకటకుమారి, జీవీఎంసీ సీసీపీ సునీతతోపాటు వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజులకు ఆయన ఫిర్యాదు చేశారు. రేసపువానిపాలెం డివిజన్, 25వ వార్డు పరిధిలోని సర్వే నంబర్ 13లో 50-82-8/3 ఇంటి నంబర్ వద్ద సుమారు కోటి రూపాయల విలువైన 100 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఎస్.మల్లేశ్వర్, శంకర్ అనే ఇద్దరు వ్యక్తులు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో ఇదే స్థలాన్ని వారు కబ్జా చేసి రెండంతస్తులు నిర్మించడంపై ఫిర్యాదులు రావడంతో గత నవంబర్ 30న సీతమ్మధార తహసల్దార్ శ్యామ్‌ప్రసాద్ పరిశీలించి అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని ఆదేశించారని గుర్తుచేశారు. ప్రభుత్వ స్థలమని రెవెన్యూ సిబ్బంది అక్కడ ఏర్పాటు చేసిన బోర్డును తొలగించి, వారం రోజులుగా కబ్జా చేసిన స్థలంలో మళ్లీ ఆ వ్యక్తులు నిర్మాణాలు చేపడుతున్నారని, ఈ స్థలాన్ని కాపాడాలని కోరుతూ ఉన్నతాధికారులకు కార్పొరేటర్ ఫిర్యాదు చేశారు.

సుందరంగా స్నైపర్ పార్క్


బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో ఆహ్లాదకరంగా రూపుదిద్దుకున్న స్నైపర్ పార్కు

సీతమ్మధార: అందాల విశాఖ నగరానికి మరింత వన్నె తెచ్చేలా జీవీఎంసీ 14వ వార్డు సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో స్నైపర్(రాకెట్) పార్క్ రూపుదిద్దుకుంటోంది. ముగింపు పనులను త్వరితగతిన పూర్తి చేసి మరికొద్ది రోజుల్లో దీనిని ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. చక్కని వాతావరణలో ప్రజలు సేదతీరేలా.. చిన్నారులు ఆటపాటలతో గడిపేలా రూ.2.5 కోట్లతో పార్క్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే కడియం, రాజమహేంద్రవరం ప్రాంతాల నుంచి పలు రకాలు పూల మొక్కలు, చెట్లు తీసుకొచ్చి నాటారు. వాకింగ్ ట్రాక్‌లు, సీతాకోకచిలుకల ఉత్పత్తి కేంద్రం, పిల్లల ఆట స్థలం, వర్షాశ్రమాలు, పెర్గోలా, లిల్లిపాంగ్, పెవీలియన్, టాయిలెట్స్, గెజిబో, ధ్యాన, యోగా కేంద్రాల నిర్మాణంతోపాటు యాంపి థియేటర్, నీటి సరఫరా, బిందు సేద్యం వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నారు. గతంలో రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి, నాటి జీవీఎంసీ కమిషనర్ సృజన, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, స్థానిక కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజులు కలిసి పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి మొక్కలు నాటారు. జీవీఎంసీ సాధారణ నిధులతో అత్యంత సుందరంగా స్నైపర్ పార్క్‌ను నిర్మిస్తున్నట్లు వార్డు కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు తెలిపారు.

క్లుప్తంగా

'స్పందన'కు 10 అర్జీలు

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 10 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఆనంద్‌కుమార్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

విదేశీ వైద్య విద్యపై అవగాహన


మాట్లాడుతున్న డాక్టర్ భానుప్రకాష్

సీతంపేట: ఐఎస్ఎం ఫోకల్ పాయింట్ వైజాగ్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో విదేశీ వైద్య విద్యపై సందేహాల నివృత్తికి అవగాహన సదస్సు నిర్వహించారు. సంస్థ రీజనల్ డైరెక్టర్ సునీత లావణ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కిర్గిస్తాన్ యూనివర్సిటీలో సేవలందిస్తున్న భారతీయ వైద్యుడు, ఐహెచ్ఎస్ఎం వైస్ డీన్ డాక్టర్ భానుప్రకాష్ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. విదేశాల్లో వైద్య విద్యపై అవగాహన కల్పించారు. నీట్‌లో క్వాలిఫై అయిన విద్యార్థులు కిర్గిస్తాన్‌లో వైద్య విద్యను అభ్యసించడానికి అర్హులని తెలిపారు. ఐదున్నర ఏళ్ల వైద్య విద్యను ఇండియాలో కంటే తక్కువ ఖర్చుతో పూర్తి చేయవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యులు తేజ గుగ్గిళ్ల, కృష్ణసాహిత్, కుమార్ స్వామి, కుమరన్ గణేషన్, పూజా జోహ్రి పాల్గొన్నారు.

వైఎంసీఏ సౌత్ ఈస్ట్ రీజియన్ చైర్మన్‌గా రొనాల్డ్


రొనాల్డ్ విలియమ్స్

బీచ్ రోడ్డు: వైఎంసీఏ నేషనల్ కౌన్సిల్‌లో విశాఖ వైఎంసీఏకు చెందిన నలుగురికి చోటు లభించింది. వైఎంసీఏ సౌత్‌ఈస్ట్ రీజియన్ చైర్మన్‌గా మరోసారి రొనాల్డ్ విలియమ్స్ ఎంపికయ్యారు. సోమవారం జరిగిన వైఎంసీఏ నేషనల్ కౌన్సిల్ సమావేశంలో రొనాల్డ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నేషనల్ కౌన్సిల్ వైస్ చైర్‌పర్సన్‌గా డాక్టర్ బెట్సీ విలియమ్స్, ఈసీ సభ్యులుగా డాక్టర్ కృపానంద కుమార్, విజయ్‌ప్రదాన్ ఎన్నికయ్యారు.

బోటు షికారు నిలిపివేత

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో బోటు షికారును ప్రస్తుతం నిలిపివేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సముద్రంలో అలల ఉధృతి తీవ్ర స్థాయిలో ఉండటం, బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం దృష్ట్యా బోటు షికారు నిలిపివేస్తున్నామని, వాతావరణం అనుకూలించిన తరువాత కొనసాగిస్తామని పేర్కొన్నారు.

వానప్రస్థ వృద్ధాశ్రమంలో అన్నదానం


వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న సుధాకర్

మురళీనగర్: పట్టాభిరెడ్డి తోట వానప్రస్థ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సోమవారం మురళీనగర్ వాకర్స్ క్లబ్ సెక్రటరీ ఎల్వీ సుధాకర్ పండ్లు, ఫలహారం, మధ్యాహ్నం భోజనం అందజేశారు. తన తండ్రి లంకా ఆదినారాయణ సంస్మరణార్థం వృద్ధులకు వీటిని పంపిణీ చేసినట్లు సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత నాయకత్వం ఉండాలి

సీతంపేట: బాపట్ల జిల్లా అద్దంకిలో సోమవారం నిర్వహించిన యువగళం కార్యక్రమంలో 26వ వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి, టీడీపీ వార్డు అధ్యక్షుడు ముక్కా కిషోర్ పాల్గొన్నారు. టీడీపీ నేత నారా లోకేష్‌ను కలిసి ఉత్తర నియోజకవర్గంలోని సమస్యలను వివరించారు. నియోజకవర్గానికి శాశ్వత నాయకత్వం ఉండేలా చూడాలని ఆయనను వారు కోరారు.